# పారదర్శకంగా రేషన్ పంపిణీ



మాట్లాడుతున్న జేసీ హరికిరణ్

**కర్నూలు సచివాలయం, న్యూస్ టుడే:** వచ్చేనెల నుంచి ప్రజాపంపిణీ వ్యవస్థలో ఈ-పాస్ విధానం ద్వారా బయోమెట్రిక్ పద్ధతిన రేషన్ సరకుల పంపిణీ చేపట్టనున్నట్లు జేసీ హరికిరణ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రాజీవ్ విద్యామిషన్ సమావేశ మందిరంలో పురపాలక సంఘాల్లోని చౌకధరల దుకాణాల డీలర్లకు ఈ-పాస్ విధానంపై శిక్షణ నిర్వహించారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా 458 చౌకదుకాణాల్లో ఈ విధానం చేపడుతున్నామన్నారు. హైదరాబాదుకు చెందిన లింక్‌వెల్ సంస్థ ప్రతినిధులు మహేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. డీఎస్‌వో ప్రభాకర్‌రావు, సివిల్ సప్లై ఇన్‌ఛార్జి డీఎం బాలానాయక్ పాల్గొన్నారు.

**వేతనాలు చెల్లించాలి :** 'నెలనెలా వేల రూపాయలు వెచ్చిస్తున్నాం. గోదాముల నుంచి 50 కేజీల బస్తా ఏనాడూ ఇచ్చింది లేదు.. సొంత డబ్బులతోనే చౌకదుకాణాలకు సరకులు తెచ్చుకుంటున్నాం..దుకాణాల నిర్వహణ భారంగా మారుతుంది. సమస్యలను తీర్చి తమకు వేతనాలు ఇవ్వాల'ని డీలర్లు పౌరసరఫరాల అధికారులతో మొరపెట్టుకున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి దుకాణానికి రేషన్ సరకులు తీసుకెళ్లాలంటే మొత్తం రూ.14 డీలర్లు భరించాల్సి వస్తోందని డీలర్ల సంఘం రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి జాయింట్ కలెక్టర్ హరికిరణ్ దృష్టికి తెచ్చారు. పట్టణాల్లో అదనంగా దుకాణాల అద్దె, విద్యుత్తు ఛార్జీలు, గుమస్తాకు నెలకు రూ.6,500 తాముమ భరిస్తున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలికల్లో నాలుగోతరగతి ఉద్యోగులకిచ్చే వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆమె డీలర్ల తరపున విన్నవించారు. ప్రభుత్వం త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందని జేసీ పేర్కొన్నారు.

● అనంతరం డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో డీలర్లు సమావేశమయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమించాలని, అవసరమైతే నిరాహార దీక్షలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం తన నిర్ణయం వెలువరించే వరకు డీడీలు చెల్లించవద్దని ఆయన డీలర్లతో అన్నారు.